# జగనన్నకు అండగా నిలవాలి

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పాములపాడు మండలంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ప్రజల నుంచి అపూర్వ స్పందన
- భారీ కేక్‌తో 100 రోజుల వేడుకలు

**పాములపాడు:** జననేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని, ప్రజల ఆశీర్వాదాలు ఆయనకు మెండుగా ఉండాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ మజరా కృష్ణానగర్ గ్రామంలో 3వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలకు మంజూరైన సంక్షేమ పథకాలు, లబ్ధి పొందిన వివరాలతో కూడిన బుక్‌లెట్ అందజేస్తూ వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. రాష్ట్రంలో అర్హులైన వారికి అన్యాయం జరుగకూడదనేది ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. ప్రతి ఇల్లు బాగుండాలి, ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

**ఘనంగా 100 రోజుల పండుగ**

మద్దూరు గ్రామ పంచాయతీతో మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. అధికారులు సైతం అందుబాటులో ఉండి పర్యటన కొనసాగించడం వల్ల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, పరిష్కరించే అవకాశం లభించిందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌కట్‌చేసి మండలంలో ముగింపు కార్యక్రమం, గడప గడపకు కార్యక్రమం చేపట్టి 100 రోజులు పూర్తయిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు అఖ్తరున్నిసా, ఎంపీటీసీ బషీరాహ్మద్, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు చెరుకుచెర్ల రఘురామయ్య, సొసైటీ చైర్మన్లు చౌడయ్య, ఎల్వీ రమణారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, కో ఆప్షన్ సభ్యుడు ముర్తుజావలి, నాయకులు రామలింగేశ్వరరెడ్డి, జబ్బార్, భీమ శేఖర్, శివలింగం, మహ్మద్ గౌస్, రాముడు, పీరయ్య, రమణారెడ్డి, రాజన్న, షేక్షాఅలీ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

## కోళ్లకు తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కోళ్లకు వ్యాక్సిన్లు వేస్తున్న వెటర్నరీ ఆఫీసర్ సులోచన

**మహానంది:** కోళ్లకు తెగుళ్లు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని లైవ్‌స్టాక్ వెటర్నరీ ఆఫీసర్ సులోచన సూచించారు. తమ్మడపల్లె గ్రామంలో గురువారం కోళ్లకు తెగుళ్లు రాకుండా వ్యాక్సిన్లు వేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కోళ్లకు ఎఫ్–1 వ్యాక్సినేషన్ డ్రాప్స్, కే–1 వ్యాక్సిన్లను 0.5ఎం.ఎల్ చొప్పున వేసినట్లు ఆమె చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కోళ్లను పెంచుకుంటున్న వారు స్థానిక పశువైద్య కేంద్రాలను సంప్రదించి వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు.

## క్లుప్తంగా

### శనగల బసవన్నకు పరోక్షసేవ

**శ్రీశైలంటెంపుల్:** స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి గురువారం సాయంత్రం త్రయోదశి సందర్భంగా పరోక్షసేవను ఈఓ ఎస్ లవన్న, అర్చకులు నిర్వహించారు. ఇందులో భాగంగా నందీశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలను నిర్వహించారు. శనగల బసవన్నకు శాస్త్రోక్తంగా విశేష అన్నాభిషేకాలను నిర్వహించారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను మహానైవేద్యంగా సమర్పించారు.

**దత్తాత్రేయస్వామికి విశేషపూజలు**

లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించింది. అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు. దేవస్థానం ఈఓ లవన్న పాల్గొన్నారు.

### గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

**కొత్తపల్లి:** ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కౌసల్య సూచించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే నీతికథలు, జనరల్ నాలెడ్జ్, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, రాష్ట్రాల, దేశాల చరిత్రల పుస్తకాలను చదివించారు. ప్రతి ఒక్కరికీ కావాలసిన పుస్తకాలు గ్రంథాలయంలో ఉంటాయన్నారు.

### యూరియా కొరత లేదు

**వెలుగోడు:** మండలంలో యూరియా కొరత లేదని, రైతులకు అవసరమైనంత అందుబాటులో ఉందని ఏఓ సునిత తెలిపారు. గురువారం పట్టణంలోని ఆరు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల్లో 11 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని చెప్పారు. అలాగే 21 మంది డీలర్ల వద్ద 29 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయన్నారు. డీఏపీ కూడా అందుబాటులో ఉందని తెలిపారు.

### ఉచిత వైద్యశిబిరం విజయవంతం

**ఆత్మకూరు:** పట్టణంలోని శ్రీచౌడేశ్వరి దేవి కమ్యూనిటీ హాల్‌లో గురువారం బలిజ మహాసంకల్ప కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైనట్లు ఆ సంఘం నాయకులు పసుపులు వెంకటేశ్వర్లు, స్వామి తెలిపారు. నంద్యాల శాంతిరాం వైద్య సిబ్బంది సహకారంతో బలిజసోదరులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వారు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

### చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

**వెలుగోడు:** తెలుగు గంగ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి డిమాండు చేశారు. గురువారం రైతులతో కలిసి వెలుగోడు తెలుగు గంగ జలవనరుల శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు గంగ ఆయకట్టు రైతులు మూడేళ్లుగా పంటలు నష్టపోయారని తెలిపారు. ఈ ఏడాది కూడా రబీలో రైతులు పంటలు సాగు చేశారని, మే 10 వరకు తెలుగు గంగకు సాగు నీరు అందించాలని కోరారు.

### సీనియర్ పాత్రికేయుడి మృతి



అల్తాఫ్‌హుస్సేన్ (ఫైల్)

**వెలుగోడు:** మండలంలోని సీనియర్ పాత్రికేయుడు అల్తాఫ్ హుస్సేన్ (53) బుధవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. గురువారం ఆయన మృతదేహానికి సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, యూత్ నాయకుడు షంషీర్ అలీ, కే.రామ్మోహన్‌రెడ్డి, తెలుగు వెంకటరమణ, ఎంపీటీసీలు చాంద్‌బాషా, శంకర్‌నాయక్, పాత్రికేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

**జూపాడుబంగ్లా:** సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని తరిగోపుల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయం అపరిశుభ్రంగా ఉండటంతో శుభ్రంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. అలాగే ఉద్యోగుల హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చేయాలని సూచించారు.

### యర్రగూడూరులో పశువైద్య శిబిరం

**పాములపాడు:** మండలంలోని యర్రగూడూరు గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. అనిమల్ వెల్ఫేర్ ఫోర్ట్‌నైట్ వారోత్సవాల్లో పశువులకు, దూడలకు నట్టల నివారణ మందులు, పాడి పశువులకు చూడీ పరీక్షలను పశువైద్యాధికారి భాస్కర్ నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు సంజీవరాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పొలంబడితో రైతులకు ప్రయోజనం

**కొత్తపల్లి:** రైతులు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులను తెలుసుకోవచ్చని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ అన్నారు. గురువారం మండల వ్యవసాయాధికారి కె.మహేష్ ఆధ్వర్యంలో మండలంలోని దుద్యాల గ్రామ పొలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ ఆంజనేయ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించడమే పొలంబడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులను వివరించారు. ముఖ్యంగా శనగ పంటను సాగుచేసే విధానం, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. శనగ పంటలో పురుగుల ఉధృతిని తగ్గించేందుకు ఎకరానికి 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలని సూచించారు. వీటి వాడకం వల్ల పురుగుల మందుపై హెచ్చించే ఖర్చు నుంచి విముక్తి కలుగుతుందన్నారు. పొలంచుట్టూ రక్షణ పంటగా జొన్న పంటను వేసుకోవడం వల్ల రసం పీల్చు పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల సమీపంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏడీఏ ఆంజనేయ

**మెలకువలతో అధిక దిగుబడులు**

**మిడుతూరు:** పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ పీరునాయక్ అన్నారు. మండల పరిధిలోని మాసపేట, కడుమూరు గ్రామాలలో పొలంబడి కార్యక్రమం, పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. అనంతరం శనగ, పొగాకు పంటల సాగులో పంట కోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ చంద్రమౌళి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉశేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

**తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి**

**జూపాడుబంగ్లా:** వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో సాగుచేసిన మొక్కజొన్న పంటలో ఏఓ కృష్ణారెడ్డి ఆర్బీకే సిబ్బంది, రైతులతో కలిసి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 80బన్నూరు ఆర్బీకే వీఏఏ వాణి, రైతులు పాల్గొన్నారు.

# 'చలో సిద్ధేశ్వరం' విజయవంతం చేయండి

**పాములపాడు:** ఈ నెల 28న సిద్ధేశ్వరంలో తలపెట్టిన రాయలసీమ ప్రజా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో చలో సిద్ధేశ్వరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జికి బదులుగా రోడ్‌కమ్ బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి పక్క రాష్ట్రాలకు నీరు తరలించుకుపోతున్నారని, రాయలసీమ ప్రాంత వాసులు మాత్రం తాగు, సాగు నీటికష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు ఎల్లయ్య, సుబ్బరాయుడు, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సేవలందించేందుకే ఆధార్ కేంద్రాలు

**పగిడ్యాల:** ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఆశయంతో ప్రభుత్వం గ్రామాల్లోనే మొబైల్ ఆధార్ సదస్సులను నిర్వహిస్తోందని, డిజిటల్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని ఎంపీడీఓ వెంకటరమణ ఆదేశించారు. గురువారం మండలంలోని ఎం, ఎస్. ఘణపురం గ్రామాల్లో నిర్వహించిన మొబైల్ ఆధార్ క్యాంప్‌ను ఎంపీడీఓ పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం పడమర ప్రాతకోట గ్రామంలోని జగనన్న ఆదర్శ కాలనీలోని లబ్ధిదారులను కలిసి ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని కోరారు. ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుంటే ఉగాదికి గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వ ఆలోచన అని వివరించారు. మార్చి 24లోగా నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే రద్దు చేస్తారని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సమతయశోదర, శ్వేత, ఇషాంబాషా, తదితరులు ఉన్నారు.

**ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి**

**మిడుతూరు:** ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని కడుమూరు గ్రామంలో ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డులో తప్పు, ఒప్పులను సవరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణ్ సింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులు**

**బండిఆత్మకూరు:** షెడ్యూల్ ప్రకారం వివిధ గ్రామాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. ఈనెల 19న పెద్దదేవళాపురంలో, 20న సంతజూటూరులో, 21న నారపురెడ్డి కుంట గిరిజన తండాలో, 23న చిన్నదేవళాపురంలో, 24న నారాయణాపురం గ్రామంలో క్యాంపులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# హెచ్చరికలు బేఖాతర్

**ఆత్మకూరురూరల్:** నగరాల్లో, పట్టణాల్లో ఉండే ట్రాఫిక్ ఐలాండ్స్, సెంటర్లలో జాతీయ నాయకుల విగ్రహాలను ప్రతిష్ఠించుకుని గౌరవించుకోవడం నాగరిక సమాజపు ఉత్తమ విలువ. అయితే ఇటీవల కాలంలో ఆయా నాయకుల ప్రతిష్టకు భంగం కలిగించేలా రాజకీయ పక్షాలు, ఆధ్యాత్మిక సంస్థలు ఆయా విగ్రహాల చుట్టు రకరకాల ఫ్లెక్సీలు, జెండా తోరణాలు కట్టడం సర్వసాధారణమైంది. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య కూడళ్లలో ఉన్న అంబేడ్కర్, ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఇలాంటి ముప్పే తరుచు ఎదురవుతూ ఉంది. దీన్ని నివారించేందుకు మున్సిపల్ అధికారులు ఆయా విగ్రహాల వద్ద హెచ్చరిక బోర్డు ఉంచారు. అయినప్పటికీ ఇటీవల టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆ పార్టీకే చెందిన నాయకులు ఈనెల 1న ఫ్లెక్సీనొకదాన్ని ఉంచారు. ఫ్లెక్సీ విగ్రహం ప్రజలకు కనబడకుండా పూర్తిగా కప్పేసింది. సహజంగానే మున్సిపల్ అధికారులు దాన్ని తొలగించారు. అయితే ఏం జరిగిందో ఏమో గాని టీడీపీ వాళ్లు దానిని తిరిగి ఏర్పాటు చేశారు. అయితే ఈసారి మున్సిపల్ అధికారులు దానిని ఇప్పటి వరకు తొలగించక పోవడం, ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఎన్టీఆర్ విగ్రహాన్ని కప్పి వేస్తూ ఏర్పాటైన ఫ్లెక్సీ

## ఆటో బోల్తా

**శ్రీశైలంప్రాజెక్ట్:** తెలంగాణ ప్రాంతానికి చెందిన కొంత మంది యాత్రికులు శ్రీశైలం వస్తుండగా శ్రీలక్ష్మీ నీలంపాటి అమ్మవారి ఆలయం సమీపంలో ఆటో బోల్తా పడడంతో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. వారు శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు తీసుకుని వెళ్లిపోయారు.

## ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు

**జూపాడుబంగ్లా:** మరో పదినిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న తరుణంలో వెనుకనుంచి వచ్చిన బైక్ ఢీకొనటంతో ప్రమాదంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జూపాడుబంగ్లాలో చోటుచేసుకుది. వివరాలు ఇలా...తరిగోపుల గ్రామానికి చెందిన రమేష్ భార్యాపిల్లలతో కలిసి ఐజ నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. జూపాడుబంగ్లా బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని క్రాస్‌చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంతో రమేష్ తలకు తీవ్రగాయాలు కాగా 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## దోమ తెరల పంపిణీ



దోమ తెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**మిడుతూరు:** మండల కేంద్రమైన సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు గురువారం అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు గుర్జాల అహ్మద్ ఆధ్వర్యంలో దోమ తెరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే పేదలందరికీ సేవ చేయాలన్నదే ఆశయమన్నారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలా వైద్య సిబ్బంది పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శారద, వైఎస్సార్‌సీపీ నాయకులు తువ్వా వెంకటనాగిరెడ్డి, నమద్ అలీ ఉన్నారు.

## కోలుకోలేక వ్యక్తి మృతి

**పగిడ్యాల:** జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గొల్ల బాలస్వామి(61) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. పగిడ్యాలకు చెందిన మృతుడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సొంత భూమి అరఎకరానికి తోడు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాడు. అలాగే ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. పంటల కోసం, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు అధికం కావడంతో మనస్థాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య మద్దమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపారు.

## ఘనంగా యోగి వేమన జయంతి

**శ్రీశైలంప్రాజెక్ట్:** యోగివేమన జయంతి కార్యక్రమాన్ని గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి హుస్సేన్‌బాషా, తెలుగు అధ్యాపకులు కె.రాజన్న యోగి వేమన గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన పద్యాల ద్వారా సంఘ సంస్కరణల కోసం ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బుచ్చయ్య, పద్మ, ఉన్నూరు సాహెబ్, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నరసింహయ్య సేవలు మరువలేనివి

**ఆత్మకూరు:** సీపీఎం ఉద్యమ నిర్మాత తెలకపల్లి నరసింహయ్య సేవలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజశేఖర్, యాదాటి నాగేంద్రుడు అన్నారు. స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో గురువారం కామ్రేడ్ నరసింహయ్య 4వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీపీఎం బలోపేతానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ప్రతి గ్రామంలో, పట్టణంలో పార్టీ ఏర్పాటుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి రణధీర్, నరసింహనాయక్, మాబాషా, స్వాములు తదితరులు పాల్గొన్నారు.



నరసింహయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**మిడుతూరు:** మహిళలు జీవనోపాధులు మెరుగుపరచుకొని ఆర్థిక పరిపుష్టి సాధించాలని గ్రామ సర్పంచు ఉషారాణి, సింగిల్ విండో చైర్మన్ నాగతులసిరెడ్డి అన్నారు. గురువారం నాగలూటి గ్రామంలో ఎబినేజర్ మినిస్టరీస్ ఫాదర్ యాకోబు ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు మాట్లాడుతూ ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు ఎబినేజర్ మినిస్టరీస్ ఫాదర్ పేద ముస్లీంలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షీరాజుద్దీన్, వైస్ ఎంపీపీ నబీరసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న పుల్లారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, కరీంలు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# ప్రత్యేక హోదా కోసం ట్రైసైకిల్‌పై..

- ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు దివ్యాంగుడి యాత్ర

**జూపాడుబంగ్లా:** నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలంటూ 30 ఏళ్ల దివ్యాంగుడు నెయ్యిల ప్రసాదు ట్రైసైకిల్‌పై ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు యాత్ర చేపట్టాడు. గురువారం యాత్ర జూపాడుబంగ్లాకు చేరుకుంది. జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం వద్ద అధికారుల మద్దతు కోరుతూ.. వారి నుంచి ధ్రువపత్రాన్ని తీసుకున్నాడు. ఈ సందర్భంగా 'సాక్షి' ఆయనను పలకరించగా తన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలం, బోమగం గ్రామమని తెలిపారు. తనకు పోలియో వచ్చి రెండుకాళ్లు చచ్చుబడినట్లు తెలిపారు. 13 జిల్లాల్లోని 195 మండలాల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలని కోరుతూ ప్రచారం చేస్తూ.. ప్రతి మండల కార్యాలయంలో అధికారుల నుంచి మద్దతు పత్రాలు తీసుకుంటున్నట్లు తెలిపాడు. తన పర్యటన పూర్తి కాగానే సేకరించిన పత్రాలతో ఢిల్లీకి వెళ్లి పీఎం నరేంద్రమోదీ, వెంకయ్యనాయుడులను కలిసి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరనున్నట్లు తెలిపాడు. అనంతరం ఎంపీడీఓ మంజులవాణి ప్రసాదుకు ధ్రువీకరణ పత్రం అందజేయడంతో తన ప్రయాణాన్ని కొనసాగించాడు.



పాములపాడులో ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

**ప్రసాద్‌కు అభినందనలు**

**పాములపాడు:** రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు దివ్యాంగుడు నెయ్యిల ప్రసాద్ చేపట్టిన ట్రైసైకిల్ యాత్ర గురువారం పాములపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండలంలోని వైఎస్సార్‌సీపీ, సీపీఐ నాయకులు స్వాగతం పలికి అభినందించారు. సీపీఐ జిల్లా నాయకులు రమేష్ బాబు, ఇస్కాల సర్పంచు మౌలాలి, వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్షాఅలీ, సీపీఐ నాయకుడు ప్రసాద్, ప్రతాప్, బీఎస్పీ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

**బండిఆత్మకూరు:** ప్రభుత్వ పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం ఇస్తున్నట్లు జాతీయ ఉపాధి హామీ పథకం నంద్యాల క్లస్టర్ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ తెలిపారు. గురువారం జీసీపాలెం, నెమళ్ల కుంట గిరిజన తండాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం వందరోజులు పనిదినాలు కల్పించడానికి ఏర్పాట్లు చేసిందన్నారు. కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు. దీంతో కొందరు కూలీలు మాట్లాడుతూ ప్రస్తుతం వరినాట్లు ఉన్నాయని, కొంత కాలం తర్వాత పనులకు వస్తామని ఆయనతో తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధ, నాగార్జున, టీఏలు షేక్షావలి, ప్రసాద్, స్వాములు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న బాలాజీనాయక్

# ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు ఇవ్వాలి

**పాములపాడు:** జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రుద్రవరం గ్రామంలో పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం ఇస్తున్న రూ.1,80,000 ఏమాత్రమ సరిపోవన్నారు. ఫిబ్రవరి నెలలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి ప్రసాద్, ప్రతాప్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ముగిసిన ఫుట్‌బాల్ లీగ్ పోటీలు



- విజేతగా నిలిచిన ఏలూరు జట్టు

ఏలూరు జట్టుకు ట్రోఫీ అందించిన ఎమ్మెల్యే శిల్పా రవి

**నంద్యాల(సిటీ):** హోరా హోరీగా జరిగిన రాష్ట్ర స్థాయి శాప్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలు గురువారం ముగిశాయి. స్థానిక ఎస్పీజీ కళాశాలలో ఈ నెల 18వ తేదీ నుంచి జరిగిన పోటీలకు 12 జట్లు పాల్గొన్నాయి. అత్యంత ప్రతిభ చూపిన ఏలూరు జిల్లా జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌గా నెల్లూరు, 3వ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా నిలిచింది. ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడాకారులు నిత్యం సాధన చేస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని, క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. గెలుపోటములను సమానంగా తీసుకుని ముందుకుసాగాలని సూచించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు, ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, శాప్ ఫుట్‌బాల్ స్టేట్ కన్వీనర్ మహ్మద్ సిరాజుద్దీన్, జిల్లా ఫుట్ బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వణికిస్తున్న చలి

రోజురోజుకు గ్రామాల్లో చలితీవ్రత ఎక్కువ అవుతోంది. ఉదయం 8 గంటలు దాటినా ప్రజలకు చలిభయం వదలడం లేదు. పాఠశాలకు వెళ్లే చిన్నారుల దగ్గర నుంచి, పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు సైతం ఉదయాన్నే చలికి వణుకుతూ వారి పనుల్లో నిమగ్నమవుతున్నారు. చలితీవ్రత ఎక్కువగా ఉండడంతో చాలామంది ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. - కొత్తపల్లి



కొత్తపల్లి వద్ద 8 దాటినా వీడని పొగమంచు



వీరాపురం గ్రామంలో 8 గంటల సమయంలో చలిమంట కాచుకుంటున్న దృశ్యం